),

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 13.09.2019 (Telugu)**

## ఆహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప బద్రి అనుచరులైన హజ్రత్ ఉబాదహ్ బిన్ సామిత్ రజియల్లాహు అన్‌హు సద్గుణముల విశ్వాసభరిత ప్రస్తావన

*హజ్రత్ అమీరుల్ ముఖినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 13.09.2019 తేదీన - మజ్లిస్ అన్సారుల్లాహ్ ఇజ్తిమా ఇంగ్లాండ్ సభా ప్రాంగణము (Bordon, Kingsley, Country Market)లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. నేను ప్రారంభించిన బద్రి అనుచరుల ప్రస్తావన నేడు కూడ కొనసాగును. కాని అన్సారుల్లాహ్ ఇజ్తిమా సందర్భమైనందున ముందుగా నేను చెప్పదలచినదేమనగా అన్సార్ (మదీనా వాసులు), ముహాజిర్లు (మక్కా నుండి మదీనాకు వలస వచ్చిన ముస్లిములు) అనుచరులలో వుండిరి. వారు ఇస్లాం స్వీకరించిన తర్వాత తమలో పవిత్ర మార్పులు కల్పించుకొనిరి. ఆశ్చర్యకర ఆదర్శములు చూపిరి. త్యాగముల వరకు మాత్రమే పరిమితం కాక నిష్టాపరత, విశ్వసనీయత, వినమ్రతలో గొప్ప స్థాయినందుకొనిరి. ఇక్కడున్న మీలోని అధికులు అన్సార్‌తో పాటు వలసదారులే. కావున మన ముందు ప్రవేశపెట్టబడిన అదర్శములను మనమెంత వరకు పాటించుచున్నామో ఆత్మ పరిశీలన చేసుకోవలెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మొదటి అనుచరులు హజ్రత్ నూమాన్ బిన్ అమర్. వీరి నామము నూమాన్, నయీమాన్ అని రెండు రకాలుగా ప్రాచుర్యం పొందినది. హజ్రత్ నయీమాన్ బైఅతె అఖ్బ సానియాలో 70 మంది అన్సార్‌తో కలిసి పాల్గొనిరి. వీరు బదర్, ఉహద్, ఖందక్ యుద్ధములతో పాటు ఇతర యుద్ధములన్నిటిలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొనిరి. నయీమాన్ కొరకు మంచినే కోరండి ఎందుకనగా అతడు అల్లాహ్, అతని ప్రవక్తను ప్రేమించునని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పినట్లు ఒక హదీసులో గలదు. హజ్రత్ ముఆవియా ప్రభుత్వ హయాంలో హిజ్రి 60వ సం॥లో హజ్రత్ నయీమాన్ మృతి చెందిరి.

హజ్రత్ నయీమాన్ స్వభావములో హాస్యమున్నట్లు కథనములలో గలదు. వారి మాటలను విని నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఆనందించేవారు. రబీఅ బిన్ ఉస్మాన్ ఇట్లు తెలిపిరి. ఒకసారి ఒక గ్రామీణ వ్యక్తి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు రాగా అతడు తన ఒంటెను మస్జిద్ ఆవరణలో కట్టివేసి లోనికి ప్రవేశించెను. అప్పుడు కొందరు అనుచరులు హజ్రత్ నూమాన్‌తో ఇట్లనిరి. నువ్వు ఈ ఒంటెను వధించినచో మేము భుజించగలము. ఎందుకనగా మాంసము తినుటకు మేము ఉవ్విళ్ళూరుచున్నాము. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఎవరైనా ఫిర్యాదు చేసినచో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దాని పరిహారము చెల్లింతురు. కావున హజ్రత్ నూమాన్ వారి ప్రలోభాలకు లోనై ఒంటెను వధించిరి. ఆ గ్రామీణ వ్యక్తి బయటికి వచ్చి తన ఒంటెను ఈ స్థితిలో చూచి అల్లరి చేసెను. ఓ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నా ఒంటె వధించబడెను. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం బయటికి వచ్చి ఇలా ఎవరు చేశారని ప్రశ్నించిరి. నూమాన్ అని ప్రజలు సమాధానమిచ్చిరి. వారు సల్లం నూమాన్‌ను వెతుకుటకు బయలు దేరిరి. నూమాన్ అక్కడి నుండి వెళ్ళిపోయి, ఎక్కడో దాక్కొనిరి. కావున నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వారిని అన్వేషించుచు తుదకు హజ్రత్ జుబాబ్ బిన్తె జుబైర్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ వద్ద దాక్కొన్నట్లు తెలుసుకొనిరి. వారిని అక్కడి నుండి వారు సల్లల్లాహు అలైహి వసల్లం రప్పించి ఇలా ఎందుకు చేశావు? అని అడిగిరి. నేను వధించినట్లు ఎవరు మీకు సమాచారమిచ్చినారో వారు చెప్పినందుకే నేను వధించినాను. వారే నన్ను రెచ్చగొట్టిరి. తర్వాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పరిహారము చెల్లింతురని వారు నాకు చెప్పిరి. ఈ విషయము విని వారు సల్లం నూమాన్ ముఖమును ముట్టుకొని, నవ్వుకొనసాగిరి. వారు సల్లం ఆ గ్రామీణుడికి దాని ధర చెల్లించిరి. జుబైర్ బిన్ బుకార్ తన పుస్తకము 'అల్‌ఫుఖహా

వల్ మజాహిబ్'లో హ్రజత్ నూమాన్ గురించి ఒక సంఘటన తెలుపుచు ఇట్లు వ్రాసిరి. మదీనాలో ఎప్పుడైనా ఒక తోపుడు బండి వ్యాపారి వచ్చినచో హ్రజత్ నూమాన్ అతని వద్ద ఏదో ఒకటి కొనుగోలు చేసి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇది నా తరపున మీ కొరకు కానుక అని చెప్పి ఇచ్చేవారు. ఆ తోపుడు బండి వ్యాపారి దాని ధర తీసుకొనుటకు హ్రజత్ నూమాన్ వద్దకు రాగా వారు అతణ్ణి నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు తీసుకొచ్చి దీని ధర చెల్లించండి అని అనేవారు. నువ్వు దీనిని నాకు కానుకగా ఇవ్వలేదా? అని వారు సల్లల్లాహు అలైహి వసల్లం అడగగా వారిట్లు సమాధానమిచ్చేవారు. ఓ రసూలుల్లాహ్! అల్లాహ్ ప్రమాణముగా! ఈ వస్తువు కొరకు నా వద్ద డబ్బులు లేకుండెను. అది తినే వస్తువు అయినచో మీరు తినాలని, అది వుంచుకునే వస్తువు అయినచో మీరు వుంచుకోవాలని నాకు కోరిక కలిగెనని అనేవారు. అప్పుడు వారు సల్లల్లాహు అలైహి వసల్లం నవ్వి, ఆ వ్యాపారికి దాని ధర చెల్లించాలని ఆదేశించేవారు. హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఒక విచిత్ర ప్రేమానురాగ, హాస్యములతో కూడిన సమావేశాలు జరిగేవి. కేవలం గంభీర సమావేశాలు కాకుండెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నేడు ప్రస్తావించనున్న రెండవ అనుచరుని పేరు హ్రజత్ ఖుబైబ్ బిన్ అసాఫ్. హ్రజత్ ఖుబైబ్ రజియల్లాహు తఆలా అన్హు ఖజ్‌రజ్ తెగలోని బనూ హాషిమ్ శాఖకు చెందినవారు. హ్రజత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) పరమపదించిన తర్వాత వారి వితంతువు ఖబీబహ్ బిన్తె ఖారిజను హ్రజత్ ఖుబైబ్ వివాహమాడిరి. మదీనా ప్రస్థానము సమయమున హ్రజత్ ఖుబైబ్ ఇస్లాంలో చేరలేదు. అయినను మదీనా ప్రస్థానము సదర్భమున వలసదారులకు అతిథి సేవలందించు అనుగ్రహము వారికి లభించెను. హ్రజత్ తల్హా బిన్ అబ్దుల్లాహ్, హ్రజత్ సుహైబ్ బిన్ సనాన్ వారి గృహములో నివాసముండిరి. బదర్ యుద్ధముతో పాటు ఉహద్, ఖందక్, ఇతర యుద్ధములన్నిటిలో వీరు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొనిరి. ఒక కథనము మేరకు ఖుబైబ్‌నకు మదీనాలో గృహముండెను. అయినను వారు ఇస్లాం స్వీకరించలేదు. తుదకు నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం బదర్ యుద్ధము కొరకు బయలు దేరినప్పుడు మార్గమధ్యలో వీరు నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను కలిసి ఇస్లాంను స్వీకరించిరి.

సహీ ముస్లిం (హదీసు పుస్తకము)లో హ్రజత్ ఖుబైబ్ ఇస్లాం స్వీకరణ ప్రస్తావన ఇట్లు గలదు. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర సతీమణి ఉమ్ముల్ ముమినీన్ హ్రజత్ ఆయిషా (రజి) ఇట్లు ఉల్లేఖించిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బదర్ వైపునకు బయలు దేరిరి. మదీనా నుండి మూడు మైళ్ళ దూరాన వున్న హ్రతుల్ ఘమరహ్ ప్రాంతమునకు వారు చేరుకోగా అక్కడ ఒక వ్యక్తి వారిని కలిసెను. అతని ధైర్య సాహసాల చర్చ జరుగుచుండేది. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులు అతణ్ణి చూడగానే చాలా సంతోషించిరి. ఈ వ్యక్తి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి నేను మీతో కలిసి వెళ్ళుటకు, పరాజిత శత్రువుల సామాగ్రిలో భాగము పొందుటకు వచ్చినానని చెప్పెను. నువ్వు అల్లాహ్, అతని ప్రవక్తను విశ్వసించుచున్నావా? అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అతణ్ణి ప్రశ్నించిరి. నేను నమ్మడం లేదని అతను బదులిచ్చెను. బదులుగా వారిట్లనిరి. అయితే మేము అన్యారాధకునితో సహాయము తీసుకోము. ఖుబైబ్ వెళ్ళిపోయెను. మదీనా నుండి 6,7 మైళ్ళ దూరాన వున్న షజరహ్ ప్రాంతమునకు అతడు చేరుకొనెను. అతడు మరల వారిని కలిసి మొదటి సారి చెప్పినట్లే చెప్పెను. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కూడ మొదటి సారి అడిగినట్లే అడిగిరి. అతను మరల వెళ్ళిపోయెను. మరల బైజా ప్రాంతములో అతడు వారిని కలిసెను. వారిట్లనిరి. నువ్వు అల్లాహ్, అతని ప్రవక్తను విశ్వసించుచున్నావా? అవునని అతడు సమాధానమిచ్చెను. ఇప్పుడు నువ్వు మాతో వెళ్ళవచ్చునని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పిరి.

బదర్ యుద్ధములో హ్రజత్ ఖుబైబ్ బిన్ అసాఫ్ మక్కా ఖురైష్ నాయకుడైన ఉమయ్య బిన్ ఖల్ఫ్‌ను హతమార్చిరి. ఈ సంఘటనను తెలుపుచు అల్లామా నూరుద్దీన్ హల్బీ తన పుస్తకము సీరత్ హల్బియహ్‌లో ఇట్లు వ్రాసిరి. హ్రజత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ఇట్లు ఉల్లేఖించిరి. బదర్ మైదానములో నాకు ఉమయ్యహ్ బిన్ ఖల్ఫ్ కలిసెను. మూర్ఖత్వ కాలములో అతడు నా మిత్రుడు. ఉమయ్యహ్ వెంట అతని కుమారుడు అలీ కూడ యుండెను. నా వద్ద చాలా రక్షక కవచములుండగా వాటిని నేను మోయుచుంటిని. నన్ను ఉమయ్యహ్ చూడగానే పిలిచెను. నాకు నీపై ఏదైనా హక్కు

వున్నచో ఈ రక్షక కవచముల కంటే ఎక్కువ నా విలువ గలదని ఉమయ్యాహ్ అనెను. సరే అని నేను రక్షక కవచములను క్రింద పెట్టి ఉమయ్యాహ్, అతని కుమారుని చేతులను పట్టుకొంటిని. నేడు జరిగినటువంటి దినము అనగా బదర్ వంటి దినమును నా జీవితములో నేన్నెడు చూడలేదు. తన యదపై రక్షక కవచమునకు పెద్దపక్షి రెక్కలను పెట్టుకున్న వ్యక్తి ఎవరని అతడు అడిగెను. వారు హంజ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ అని తెలుపగా ఇతడే నేడు సర్వనాశనం చేశాడని, అతని వల్లనే నేడు మా పరిస్థితి ఇలా మారినదని ఉమయ్యాహ్ గునుక్కొనెను. ఇంకా హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ఇట్లు తెలిపిరి. నేను వారిద్దరిని తీసుకొని వెళ్ళుచుండగా హజ్రత్ బిలాల్ అకస్మాత్తుగా నా వెంట ఉమయ్యాహ్‌ను చూసిరి. మక్కాలో ఇస్లాంను వీడాలని హజ్రత్ బిలాల్‌ను ఉమయ్యాహ్ తీవ్రంగా హింసించేవాడు. ఉమయ్యాహ్‌ను చూడగానే హజ్రత్ బిలాల్ అవిశ్వాసుల నాయకుడు ఉమయ్యాహ్ ఇక్కడున్నాడని, ఇతడు బ్రతికినచో నేను బ్రతకలేనని కూడ అరిచిరి. నా ఖైదీల గురించి నువ్వు ఇట్లంటున్నావా ? అని నేను అడిగితిని. హజ్రత్ బిలాల్ మరల చాలా గట్టిగా ఇట్లు అరిచిరి. ఓ అల్లాహ్ సహాయకులారా? అవిశ్వాసుల నాయకుడు ఉమయ్యాహ్ బిన్ ఖల్ఫ్ ఇక్కడున్నాడు. ఇతడు బ్రతికినచో నేను బ్రతకలేను. ఇలా పదే పదే అరిచిరి. దీనిని విని అన్సార్ పరుగెత్తుకొచ్చి, మమ్ములను చుట్టుముట్టిరి. హజ్రత్ బిలాల్ ఖడ్గము తీసుకొని ఉమయ్యాహ్ కుమారునిపై దాడి చేసిరి. ఫలితముగా అతడు క్రింద పడిపోయెను. భయముతో ఉమయ్యాహ్ గంభీరంగా అరిచెను. నేను అటువంటి అరుపును ఎన్నడు వినలేదు. అనంతరం అన్సార్ వారిద్దరిని ఖడ్గములతో నరికి వేసిరి.

ఉమయ్యాహ్‌ను అన్సార్ తెగ బనూ మాజన్ తెగలోని ఒక వ్యక్తి హత్యచేసెను. కాని ఇబ్నె హష్షామ్‌లో ఇట్లు గలదు. ఉమయ్యాహ్‌ను హజ్రత్ మఆజ్ బిన్ అఫ్రా ఖార్జ బిన్ జైద్, ఖుబైబ్ బిన్ అస్‌నాఫ్ హతమార్చిరి. అ అనుచరుని ప్రస్తావనే జరుగుచున్నది. హజ్రత్ బిలాల్ అతణ్ణి హతమార్చిరని కూడ అంటారు. వాస్తవానికి ఈ అనుచులందరు ఉమయ్యాహ్‌ను హతమార్చుటలో పాల్గొనిరి. ఉమయ్యాహ్ కుమారుణ్ణి హజ్రత్ బిలాల్ క్రింద పడవేసిరి. అనంతరం అతణ్ణి హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ హతమార్చిరి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. కొన్ని సంఘటనలతో ప్రస్తావించబడుచున్న అనుచరునికి నేరుగా సంబంధము లేకున్నా నేను ప్రస్తావిస్తాను. చరిత్ర గురించి మనకు అవగాహన కలుగవలెనని నేను ప్రస్తావించుచుందును.

హజ్రత్ ఖుబైబ్ బిన్ అబ్దుర్రహ్మాన్ ఇట్లు తెలిపిరి. బదర్ యుద్ధము రోజున నా తాతకు ఒక గాయమయ్యెను. ఫలితముగా వారి ప్రక్కటెముక విరిగి పోయెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ పవిత్ర నోటి ఉమ్ము అక్కడ పెట్టి, ఎముకను నిర్ణీత చోటకు జరిపి సరిదిద్దిరి. తద్వారా హజ్రత్ ఖుబైబ్ నడవడం మొదలు పెట్ట గలిగిరి. మరో కథనములో హజ్రత్ ఖుబైబ్ ఇట్లు తెలిపిరి. ఒక యుద్ధము సందర్భమున నా భుజము నుండి కడుపు వరకు తీవ్ర గాయమయ్యెను. దాని వలన నా చెయ్యి యాలాడుచుండెను. నేను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు రాగా వారు తమ నోటి పవిత్ర ఉమ్ము పెట్టి దానిని జోడించిరి. ఫలితముగా అది పూర్తిగా నయమై నా గాయము మానిపోయెను.

హజ్రత్ ఉమర్ ఖిలాఫత్ హయాంలో హజ్రత్ ఖుబైబ్ మృతి చెందిరి. మరో కథనము ప్రకారము వారు హజ్రత్ ఉస్మాన్ ఖిలాఫత్ కాలములో మృతి చెందిరి. అల్లాహ్ తఆలా ఈ అనుచరుల స్థాయి అంతస్థులను పెంచుగాక!

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇప్పుడు నేను ముగ్గురు మృతుల గురించి ప్రస్తావింతును. నమాజుల తర్వాత వారి జనాజ నమాజ్ కూడ చదివింతును. వారిలో మొదటి వారు గౌ॥ రషీదహ్ బేగం భర్త గౌ॥ సయ్యద్ ముహమ్మద్ సర్వర్ గారు రబ్వా. 24 ఆగస్టు తేదీన 74 సం॥ల వయసులో సహజ మరణము పొందిరి. انا للہ وانا الیہ راجعون మృతురాలి వంశములో వారి తాత (తండ్రి తరపున) గౌ॥ ఫతహ్ ముహమ్మద్ గారి ద్వారా అహ్మదియ్యత్ ప్రవేశించినది. గౌ॥ ఫతహ్ ముహమ్మద్ గారు ఖాదియాన్ వెళ్ళి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరులు హజ్రత్ ఖాజి ముహమ్మద్ అక్బర్ గారి ద్వారా బైఅత్ చేయు అనుగ్రహము పొందిరి. ఖాజి గారు 1894వ సం॥లో సూర్య, చంద్ర గ్రహణ సంకేతమును చూచి ఈ సంకేతము ద్వారా ఇమామ్ మహ్దీ అలైహిస్సలాం అవతరించారని తమ ప్రాంతములో, తమ బంధిమిత్రులకు తెలిపిరి. మృతురాలి కుమారుడు ముహమ్మద్ జకరియ్యా ముబల్లిఘ్ లైబేరియా ఇట్లు వ్రాసిరి. నా తల్లి చందాలు క్రమం తప్పకుండా చెల్లించేవారు. నా చందా చెల్లించారా లేదా అని ఎంతో వ్యాకులతతో

తెలుసుకునేవారు. పిల్లల శిక్షణ, సంస్కరణ పట్ల కూడ చాలా జాగ్రత్త పడే వారు. ఖిలాఫత్ పట్ల విశ్వసనీయత, ప్రేమపూర్వక, అభిమాన సంబంధము కలిగివుండిరి. చాలా శ్రద్ధతో ఖుత్బాలు వినేవారు. ఖుత్బాల అంశములను వ్రాసుకునేవారు. అనంతరం తమ పిల్లలతో చర్చించేవారు. అల్లాహ్ తఆలా వారి సత్కర్మలను కొనసాగించు భాగ్యము వారి పిల్లలకు కలిగించుగాక! వారి స్థాయి అంతస్థులను పెంచుగాక!

రెండవ మృతులు గౌ॥ ముహమ్మద్ షంషీర్ ఖాన్ సదర్ జమాఅత్ నాంది ఫిజి గారు. వీరు 5 సెప్టెంబర్ తేదీన మృతి చెందిరి. انا للہ وانا الیہ راجعون 1962 సం॥లో వీరి తండ్రి లాహోరి జమాఅత్‌ను వీడి బైఅత్ చేసి అహ్మదియ్య జమాఅత్‌లో ప్రవేశించిరి. వీరు ఫిజి జమాఅత్‌లోని ఆరంభ సభ్యులలో ఒకరు. అల్లాహ్ తఆలా కృపానుసారము సుదీర్ఘ కాలము వరకు జమాఅత్‌నకు సేవలందించు అనుగ్రహము పొందిరి. అహ్మదియ్య జమాఅత్ మారో, సోవా, నాంది, లటూకాలో మస్‌జిదుల నిర్మాణములో వీరు కీలక పాత్ర పోషించిరి. 2010వ స॥ నుండి మృతి చెందేంత వరకు సదర్ జమాఅత్ నాందిగా సేవలందించు అనుగ్రహము పొందరి. అల్లాహ్ తఆలా మృతునితో క్షమాగుణము, కరుణామయంగా వ్యవహరించుగాక! వారి పిల్లలు కూడ సత్కర్మలను కొనసాగించు భాగ్యము పొందుదురు గాక!

మూడవ మృతురాలు ప్రస్థుతం నార్వేలో వుంటున్న గౌ॥ ఫాతిమా ముహమ్మద్ ముస్తఫా కుర్దిస్తాన్ గారు. 13 జూన్ తేదీన 88 సం॥ల వయసులో మృతి చెందిరి. انا للہ وانا الیہ راجعون వీరు 2014 సం॥లో బైఅత్ చేయు అనుగ్రహము పొందిరి. వీరి కుమార్తె ఇట్లనిరి. మా తల్లి నిరక్షరాస్యురాలైనను వారికి పవిత్ర ఖుర్ఆన్‌లోని చాలా సూక్తులు, హదీసులు కంఠస్థం వుండెను. నమాజ్‌ను నిర్ణీత సమయములో సలుపుట వారి జీవితములోని అతి ముఖ్యమైన పనిగా వుండెను. ఇదే విధంగా చాలా ఎక్కువగా ఉపవాసములుండేవారు. ఉపవాసముండు స్థోమత లేని వారి పేరున నేను ఉపవాసములుంటానని తరచుగా చెప్పేవారు. ఇతరులకు సహాయము చేయుటలో చాలా ఉత్సుకత కలిగి వుండిరి. కొన్ని సార్లు 50 మైళ్ళ ప్రయాణము చేసి కూడ ఎవరు లేని మహిళలకు ఆసుపత్రులలో సేవలందించేవారు. వారికి ఆర్థిక సహాయము కూడ చేసేవారు.

అల్లాహ్ తఆలా మృతురాలితో క్షమాగుణము, కరుణామయంగా వ్యవహరించుగాక! వారి స్థాయి అంతస్థులను పెంచుగాక! వారి కుమార్తె విశ్వాసమునకు కూడ స్థిరత్వము కలిగించుగాక! ఇంకా అహ్మదియ్యత్‌లో చేరని వారి పిల్లలకు కూడ అల్లాహ్ తఆలా విశ్వాసము ప్రసాదించు గాక! వారి దుఆలను వారి మేలు కొరకు ఆమోదించుగాక! ఆమీన్!

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

| From, | To, |
| --- | --- |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |